
చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని అం బర్‌పేట, చార్మినార్ మండల పరిధిలో ఉన్న నిరుపేద కుటుంబీకుల్లో షాదీ ముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్న 136మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బలాల సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ముగియగానే షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ మన్సూర్‌అలీ, ఆర్‌ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పెద్దఅంబర్‌పేట్‌లో జైబాపూ, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను కించపరుస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. స్వేచ్ఛ, సమానత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, పండుగుల రాజు, చామ విజయశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్, విజయేందర్‌రెడ్డి, సుప్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ మార్నింగ్‌వాక్

హయత్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని మోడి బిల్డర్స్, పారడైజ్ అపార్టుమెంట్ కాలనీల్లో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం మార్నింగ్‌వాక్ నిర్వహించారు. చెత్త సేకరించే ఆటో రావడం లేదని, వీధి కుక్కల బెడద విపరీతంగా ఉందని, కాలనీ ముందు సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీల ప్రజలు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ కాలనీ వాసులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరబాబు, శ్రీనివాస్, బిక్కు ప్రశాంత్, వెంకటరత్నం, అయ్యప్ప, శ్రీనివాసరావు, రాకేష్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం : శ్వేతారెడ్డి


డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వైశాలీనగర్, కృష్ణానగర్, ఇంద్రప్రస్థకాలనీలలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అధికారులతో కలిసి సోమవారం పర్యటించి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : అరుణారెడ్డి


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

సైదాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. వెంకటాద్రినగర్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. డివిజన్‌లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. తొలుత రహదారులు, మురుగునీరు సమస్యలను దూరం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

● జెడ్సీ హేమంత్ పాటిల్‌కు కార్పొరేటర్ వినతి



జెడ్సీ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో పలు సమస్యలున్నాయని వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విన్నవించారు. సోమవారం ఆయన జెడ్సీని కలిసి కాలనీల సమస్యలను విన్నవించారు. పలు కాలనీల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రహదారులు పాడయ్యాయని, సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కాలనీల్లో కమ్యూనిటీహాళ్లలో మరమ్మతు పనులు చేపట్టాలని విన్నవించారు. అనంతరం జెడ్సీకి వినతిపత్రం సమర్పించారు.

అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజాధికాలు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వాసవీకాలనీలో వెలసిన అష్టలక్ష్మీ ఆలయం 29వ(ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారి పల్లకిసేవ, ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. సాయంత్రం సహస్రనామ స్తోత్ర పారాయణ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విక్వరణ, మత్స్యంగ్రహణ అంకురార్పణ, ధ్వజపట ఆదివాసం, వైనతేయ ప్రతిష్ఠ, తిరుచ్చి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు పూజాకార్యక్రమాలలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాలు


ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీనివాస బంగారయ్య శర్మ

చంపాపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కేకే గార్డెన్ సమీపంలోని సువర్ణభారతి గోశాలలో సోమవారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆది శంకరాచార్య భక్త సమాజం, తత్త్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి, బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో-రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర తాజా మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కొచ్చర్ల కోట రవి, కోట విజయ శార్వాణి, భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టం-2025ను తీసుకువచ్చిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భూ భారతి చట్టంపై పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా పెద్దఎత్తున భూ కబ్జాలకు పాల్పడిందని ఆరోపించారు. భూ రికార్డులను తారుమారు చేసేందుకే అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిందని విమర్శించారు. ఆ చట్టంతో రైతులు, భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. భూ భారతి చట్టంతో భూ కబ్జాదారులను ఏరిపారేసే అవకాశం ఉందన్నారు. అన్ని రకాల భూ సమస్యలకు భూ భారతి చట్టంలో పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో మోసపూరితం, అక్రమంగా పొందిన భూములను భూ భారతి చట్ట ప్రకారం తిరిగి తీసుకునే అవకాశం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ ధరణి చట్టంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వ సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టంలో రైతులు, భూ యజమానులు భూ రికార్డులను సవరణ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. భూ విస్తీర్ణంలో మార్పులు, రికార్డుల్లో నమోదు వివరాలకు సంబంధించిన సమస్యలకు ఆర్డీఓ, తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు.. మే మొదటి వారంలోని జిల్లాలోని ఒక మండలంలో చట్టాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. మే, జూన్ నెలల్లో గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. భూ సర్వే, విచారణ జరిపిన తర్వాతనే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంలో రెండంచెలా అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూ భారతి చట్టాన్ని రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ మాజీ మంత్రి జాన్‌పోర్ట్, ఇబ్రహీంపట్నం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణితో పాటు రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.


భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి పక్కన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి : డీసీసీబీ చైర్మన్

● గౌరెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గౌరెల్లిలో జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటకు మద్దతు ధర అందించాలన్న ఉద్దేశంతోనే ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ చామ కృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారులు బాలరాజు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో జిల్లా సహకార మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పండించిన రైతులకు అండగా నిలబడి రూ.500 బోనస్ ఇస్తుందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివలింగంగౌడ్, జక్కు కృష్ణారెడ్డి, ముత్యాల రాజశేఖర్ పాల్గొన్నారు.


నూతన సీఎస్‌కు బొకే అందిస్తున్న కోట్ల శ్రీనివాస్, బేర బాలకిషన్

నూతన సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

సైదాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సోమవారం సచివాలయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, రాష్ట్ర మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, సత్యనారాయణగౌడ్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విధులలో నిబద్ధత, సేవలు ప్రభుత్వం గుర్తించి అత్యున్నత స్థానం కల్పించిందని తెలిపారు.


మేడే ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మేడేను జయప్రదం చేయండి : చంద్రమోహన్

వనస్థలిపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం వనస్థలిపురం రైతుబజార్ వద్ద తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ప్రపంచ కార్మికులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, తోపుడు బండ్ల సంఘం అధ్యక్షురాలు భారతమ్మ, వరలక్ష్మి, పాండు, రమేష్, ఋషి, చంద్రయ్య, కాశమ్మ పాల్గొన్నారు.

వ్యాపారిని బెదిరించిన రౌడీషీటర్, మరొకరు అరెస్టు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పానీపూరి వ్యాపారిని బెదిరించిన రౌడీషీటర్‌తో పాటు మరో వ్యక్తిని చాదర్‌ఘాట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దాతియా జిల్లా, సేవడా గ్రామ నివాసి శివం ప్రజాపతి కొంత కాలంగా డబీర్‌పురలోని మరియం స్కూల్ ఎదుట నివాసముంటున్నాడు. పానీపూరి వ్యాపారం శివం ప్రజాపతి ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్‌లో నిర్వహిస్తున్నాడు. ఆదివారం పానీపూరి వ్యాపారం చేస్తుండగా చాదర్‌ఘాట్ పీఎస్ రౌడీషీటర్ అక్షయ్‌కుమార్, సైదాబాద్ నివాసి నీరజ్‌కుమార్‌తో కలిసి వచ్చి మద్యం కొనుగోలు చేసేందుకు రూ.500లు ఇవ్వాలంటూ బెదిరించాడు. అందుకు శివం ప్రజాపతి నిరాకరించాడు. రౌడీషీటర్ అక్షయ్‌కుమార్ అంతటితో ఆగకుండా అసభ్యకరమైన పదజాలంతో బెదిరింపులకు గురిచేయడంతో భయపడిన శివం రూ.200లు ఇవ్వగానే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం శివం ప్రజాపతి చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ అక్షయ్‌కుమార్‌తో పాటు నీరజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో వేగంగా విచారణ జరగాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

● గరిష్ఠ శిక్షలు పడేలా కృషి : సీపీ సుధీర్‌బాబు


కమిషనరేట్‌లో ఎస్సీ, ఎస్టీ నేరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులను వేగంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ నేరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి బక్కి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసులను పరిశీలించి, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలన్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించాలన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై నమోదైన ప్రతి కేసు దర్యాప్తులో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణను వేగవంతం చేయడం ద్వారా అధిక శిక్షలు పడేలా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. న్యాయ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఈ సందర్భంగా సీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్‌లతో పాటు డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, అక్షాంశ్‌యాదవ్, అరవింద్‌బాబు, ఇందిర, జి నర్సింహారెడ్డి, సునీతారెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాల్లో విలువలు పాటించిన నేత వాజ్‌పేయ్

● రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్


మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీని సన్మానిస్తున్న ఎంపీ లక్ష్మణ్

సైదాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చిన ఏకైక నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ అధ్యక్షతన సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమ్మేళనానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయ్ దూరదృష్టి వల్లే భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని కొనియాడారు. పార్లమెంట్‌లో ఒక్క ఓటు తేడాతో ప్రధానమంత్రి పదవిని నిజాయితీతో వదులుకున్నారని తెలిపారు. నేటి రాజకీయ నాయకులు వాజ్‌పేయ్ అడుగుజాడలను అనుసరించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతారెడ్డి, భాగ్యలక్ష్మి, నేతలు సహదేవ్‌యాదవ్, హరిగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సూరజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయ్‌తో అనుబంధం ఉన్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీని ఘనంగా సత్కరించారు.


ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య తదితరులు

అర్హులకు వందగజాల ఇంటి స్థలం కేటాయించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో వంద గజాల ఇంటి స్థలం కేటాయించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలను, ఇంటిని నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన న్యాయమైన డిమాండ్‌ను అమలు చేయకపోగా ప్రభుత్వ స్థలాలను అమ్మే ఆలోచన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రం పేదలకు సొంతింటి కలను నిజం చేస్తామని హామీ ఇచ్చి అన్ని విధాలా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారు చేసే న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌకలో ఇళ్లులేని ప్రతీ నిరుపేద కుటుంబానికి 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, కాచవాని సింగారం, సట్టిఅన్నారం, ఆర్‌కే నగర్ గ్రామం ఘట్‌కేసర్ మండలం మేడ్చల్ జిల్లాలో 2003 నుంచి 2004లో ఇచ్చిన 3000 పట్టాలకు సర్వే నంబర్ 68లో 100 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గుడిసెవాసుల సంఘం(టీజీవీఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు తెలంగాణ గుడిసెవాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాకి రవి అధ్యక్షత వహించగా, ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బీఎన్ రమేష్‌కుమార్ మాదిగ హాజరై మద్దతు ప్రకటించారు. ధర్నాలో బాకి రవి, నీల వెంకటేష్, బీఎన్ రమేష్‌కుమార్, బీసీ సంఘాల నేతలు గొరిగె మల్లేష్, కుశల్‌కమార్, సీ రాజేందర్, చిరంజీవులు, అనంతయ్య, సతీష్, ఉమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ : ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే ఆమరణ దీక్ష చేపట్టడానికైనా సిద్ధంగా ఉన్నామని యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ కో ఆర్డినేషన్ కమిటీ తరుపున ధర్మతేజ, విజేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో బడ్జెట్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె పదో రోజుకు చేరింది. అందులో భాగంగా సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్య కుంటుపడిందని, ఇలా సాగదీస్తే విద్యార్థుల నుంచి కూడా ప్రభుత్వం వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ పరుశరామ్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ చెన్న గౌడ్, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ కవిత, డాక్టర్ వినీతపాండే, డాక్టర్ సనత్ పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్లల్లో చోరీ

● నల్లా పైపులు, విద్యుత్ వైర్లు అపహరణ

సరూర్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు పలు వస్తువులను అపహరించుకుపోయిన సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బడంగ్‌పేట్‌లోని మునిసిపల్ కాలనీ వెంచర్-2లో కొందరు యజమానులు ఇటీవల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడి నాలుగు ఇళ్లల్లో బిగించడానికి తీసుకువచ్చిన నల్లాలు, నల్లా పైపులు, బాత్‌రూమ్ ఫిట్టింగ్‌లు, ఎలక్ట్రిక్ వైర్లు, ఇతర సామగ్రిని అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం బాధితులు చోరీ జరిగిన విషయం గమనించి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయా సామగ్రిని అపహరించుకుపోవడం గమనించి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం పిల్లి గుడిసెల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ లోడ్ పెరడంతో సోమవారం అగ్నిప్రమాదానికి గురైంది. దీంతో అప్రమత్తమైన స్థానికులు అస్మాన్‌ఘడ్ విద్యుత్ అధికారులకు, మలక్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అగ్నిమాపక దళానికి ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన అగ్నిమాపక దళం రంగంలోకి దిగింది. అప్పటికే విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గుర్రంగూడ, అల్మాస్‌గూడలోని

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

● ప్రజావాణిలో బీజేపీ నేత మంజులారెడ్డి ఫిర్యాదు


గుర్రంగూడలో సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణాలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ పరిధిలో గల గుర్రంగూడ, అల్మాస్‌గూడలోని పలు కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ డివిజన్ నాయకురాలు, కంటెస్టెడ్ కార్పొరేటర్ జక్కిడి మంజులాజంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సదరు అక్రమ నిర్మాణాలపై ఆమె ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని తిరుమలానగర్, న్యూతిరుమలానగర్, శ్రీహిల్స్, శ్రీశ్రీ హోమ్స్, మధురానగర్, వెంకటేశ్వరకాలనీ, మల్లారెడ్డికాలనీ, గడ్డం ఎన్‌క్లేవ్ ఫేజ్-1,2,3, టెలికాం అండ్ పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో బిల్డర్లు మునిసిపల్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల ప్రకారం రోడ్డు వైపు సెట్‌బ్యాక్ వదలడం లేదని, అనుమతులు ఒకలా ఉంటే నిర్మాణాలు మరోలా జరుపుతున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది దీనిపై దృష్టి పెట్టకపోవడంతో మునిసిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఆర్టిజన్‌కు గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టిజన్ సునీత

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు కౌంటర్‌ను తెరిచేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విద్యుత్ ఆర్టిజన్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి నివాసి తేలూరి సునీత(35) చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తుంది. విద్యుత్ బిల్లుల వసూళ్లలో భాగంగా ఆర్టిజన్ సునీత విద్యుత్ బిల్లు కౌంటర్ తెరిచేందుకు తన ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం చైతన్యపురి నుంచి చాదర్‌ఘాట్ సబ్‌స్టేషన్‌కు వస్తుంది. చాదర్‌ఘాట్ చౌరస్తాకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం సునీత నడుపుతున్న వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆమె అదుపు తప్పి కిందపడడంతో ఎడమ కాలు మోకాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కేర్ ఆస్పత్రి మలక్‌పేటకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.